సాక్షి అనంతపురం

మంగళవారం । 25 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



కొనసాగుతున్న వరద

తుంగభద్ర జలాశయానికి భారీగా వరద చేరుతోంది. సోమవారానికి 25.417 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 47,279, అవుట్‌ఫ్లో 213 క్యూసెక్కులుగా నమోదైంది.

గరిష్టం/కనిష్టం
32.2°/21.5°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పేదలకు ఇళ్లివ్వటాన్ని ఓర్వని టీడీపీ



మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: నిరుపేదలకు ఇళ్ల పట్టాలు.. పక్కాగృహాలు మంజూరు చేయడాన్ని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఓర్చుకోలేకపోతోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. సోమవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 30.65 లక్షల మంది నిరుపేదలను గుర్తించి వారికి 17వేల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతోందన్నారు. రూ.కోట్లు వెచ్చించి మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తోందన్నారు. ఇది ఓర్వలేని టీడీపీ నాయకులు ఆందోళనలు చేపట్టి పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని ప్రజలను మభ్య పెట్టేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. అమరావతి సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్లు నిర్మించాలన్న ప్రభుత్వానికి అనుకూలంగా కోర్టు తీర్పు రావడం జీర్ణించుకోలే సుప్రీం కోర్టును ఆశ్రయించారని ధ్వజమెత్తారు. అన్ని సామాజిక వర్గాలు కలిసిమెలిసి ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఎన్నికల ముందు మాత్రమే చంద్రబాబుకు సామాజిక వర్గాలు గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు. దీనిని రాష్ట్ర ప్రజలు గుర్తించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణం చరిత్రాత్మకం



మాట్లాడుతున్న పైలా

అనంతపురం క్రైం: అమరావతి సీఆర్‌డీఏ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం చరిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అభివర్ణించారు. గత టీడీపీ ప్రభుత్వం అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు సొంతింటి కల సాకారం చేస్తోందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరావతి సీఆర్‌డీఏ పరిధిలో 50,793 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకూడదని టీడీపీ అధినేత చంద్రబాబు నకిలీ ఉద్యమాలు చేయించడంతో పాటు కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు.


బెటాలియన్ల అభివృద్ధికి చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం బెటాలియన్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని బెటాలియన్ రేంజ్–3 డీఐజీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం జంతలూరు సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌ను ఆయన పరిశీలించారు. బెటాలియన్ నిర్మాణం, సిబ్బంది వివరాలపై కమాండెంట్ జగదీష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ రమణమూర్తి, ఆర్ఐలు లోకేశ్వర నాయుడు, సీతారామారావు, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రిక్వెస్టులు రైజ్ చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జగనన్న సురక్ష'లో నమోదైన టోకన్లకు అనుగుణంగా సర్వీస్ రిక్వెస్టులను రైజ్ చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష, తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ఇప్పటి వరకు 2,17,625 టోకెన్లు నమోదు చేశారన్నారు. అందులో 2,03,767 సర్వీస్ రిక్వెస్టులను రైజ్ చేశారన్నారు. టోకెన్లకు అనుగుణంగా రిక్వెస్ట్‌లు రైజ్ కావాలని సూచించారు. సర్వీస్ రిక్వెస్టులు గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. బడిబయటి పిల్లలను తిరిగి బడిలోకి చేర్పించేలా చూడాలని చెప్పారు. 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన పనుల ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ–కేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఉపాధికి వందనం

అడిగిన వెంటనే పనులు. కొలతలు తీసి వివరాలు నమోదు చేశాక సకాలంలో కూలి చెల్లింపులు. ఉన్న ఊరిలోనే కావలసినన్ని పనులు లభిస్తుండటంతో ఉపాధి హామీ కూలీలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. పొట్ట కూటి కోసం కూలీలు పిల్లాపాపలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులకు 'ఉపాధి హామీ పథకం' చెక్ పెట్టినట్లయ్యింది.

- ఉమ్మడి జిల్లాలో భారీగా కూలి పనులు
- అనంతలో 2.83 లక్షల మందికి లబ్ధి
- శ్రీసత్యసాయిలో 1.93 లక్షల మందికి..
- ఒక్కో కుటుంబానికి సగటున 45 పనిదినాలు
- రెండు జిల్లాల్లో రూ.365 కోట్లకు పైగా చెల్లింపులు
- గతంతో పోల్చితే భారీగా చేకూరిన ఆర్థిక లబ్ధి



ఉపాధి హామీ పథకం కింద పొలంలో పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడంలో ఉమ్మడి జిల్లా గణనీయమైన వృద్ధి సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో ఇప్పటి వరకు ఒక్కో కుటుంబానికి సగటున 45 పని దినాలు కల్పించి ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచారు. రైతు కూలీలు ఎక్కువగా ఉండే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ పథకం మంచి ఫలితాలనిచ్చింది. అన్నిటికీ మించి జిల్లా అధికారులు కూలీలకు సకాలంలో పని దినాలు కల్పించడంలో సఫలమయ్యారు.

మూడున్నర మాసాల్లోనే 45 పని దినాలు..

2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూలై 11వ తేదీ వరకూ అంటే మూడున్నర నెలల్లోనే సగటున 45 పనిదినాలు కల్పించడం గొప్ప విషయం. అనంత పురం జిల్లాలో 2,357 కుటుంబాలు 100 రోజుల పనులు పూర్తి చేసుకున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 1,720 కుటుంబాలు వంద రోజుల పనులు పూర్తి చేసుకున్నాయి. ఏప్రిల్ నుంచి జూలై వరకు వ్యవసాయ పనులు పెద్దగా ఉండవు. కాబట్టి 'ఉపాధి' పనులు కూలీల వరంగా చెప్పుకోవచ్చు.

అక్కడ కదిరి.. ఇక్కడ శింగనమల..

గడిచిన మూడున్నర మాసాల్లో శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో అత్యధికంగా 40,476 మంది కూలీలకు పనులు లభించాయి. దీనికోసం రూ.26 కోట్ల వ్యయం అయింది. అదేవిధంగా అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో అత్యధికంగా 67,951 మంది కూలీలకు ఉపాధి కల్పించారు. ఇందుకు రూ.58.45 కోట్లు వెచ్చించారు. ఇలా రెండు జిల్లాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద భారీగా లబ్ధి జరిగింది.



శెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన నరసింహులుకు ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు – 12167210 4003030005 ఉంది. నరసింహులు, ఆయన భార్య ఇద్దరూ కలిసి 'ఉపాధి' కూలి పనులకు వెళ్తున్నారు. వీరికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.22 వేల దాకా కూలి రూపంలో అందింది. ఉపాధి పనులు ఇలాంటి వారికి ఎంతో మేలు చేస్తున్నాయి.



శింగనమలకు చెందిన ఇతని పేరు మునిస్వామి. ఉపాధి హామీ కూలీ. కుటుంబంలో భార్య, భర్త కలిసి గత మే ఒకటో తేదీ నుంచి ఈ నెల పదో తేదీ వరకు పనులకు వెళ్లారు. వీరికి వంద పని దినాలు పూర్తయ్యాయి. పనులు దొరకని వేసవిలో పనులు కల్పించారని, బిల్లులు కూడా త్వరగానే ఇచ్చారని మునిస్వామి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనంతపురం జిల్లాలో 'ఉపాధి' అమలు ఇలా..		
నియోజకవర్గం	కూలీల సంఖ్య	చేసిన వ్యయం
గుంతకల్లు	34,180	రూ.26.75 కోట్లు
కళ్యాణదుర్గం	36,495	రూ.31.40 కోట్లు
రాప్తాడు	23,969	రూ.34.40 కోట్లు
రాయదుర్గం	41,799	రూ.34.96 కోట్లు
శింగనమల	67,951	రూ.58.45 కోట్లు
తాడిపత్రి	36,919	రూ.42.24 కోట్లు
ఉరవకొండ	41,797	రూ.31.74 కోట్లు

శ్రీసత్యసాయి జిల్లాలో 'ఉపాధి' అమలు ఇలా..		
నియోజకవర్గం	కూలీల సంఖ్య	చేసిన వ్యయం
ధర్మవరం	35,572	రూ.19.40 కోట్లు
హిందూపురం	8,405	రూ.4.08 కోట్లు
కదిరి	40,476	రూ.26.01 కోట్లు
మడకశిర	22,443	రూ.11.85 కోట్లు
పెనుకొండ	23,644	రూ.13.10 కోట్లు
పుట్టపర్తి	33,697	రూ.18.19 కోట్లు
రాప్తాడు	29,250	రూ.13.35 కోట్లు

లక్ష్యానికి మించి పనిదినాలు



ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించాం. మూడున్నర నెలల్లోనే 45 పని దినాలు పూర్తయ్యాయి. ఇంకా సమయం ఉంది కాబట్టి పనిదినాలు కల్పించి పేదలకు ఆర్థిక ఇబ్బందులు రాకుండా చూస్తాం. ముఖ్యంగా మహిళా కూలీలు ఎక్కువ మంది లబ్ధి పొందారు.

– వేణుగోపాల్‌రెడ్డి, పీడీ, డ్వామా

'అనంత'కు 2 టమాట ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు

- నేడు వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్ భూమి పూజ



అనంతపురం అగ్రికల్చర్: టమాట రైతులకు శుభవార్త. జిల్లాకు రెండు టమాట ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరయ్యాయి. కళ్యాణదుర్గం మండలం వెంకటాంపల్లి, కుందుర్పి మండలం బండమీదపల్లిలో ఏర్పాటు చేయబోయే ఈ యూనిట్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్ విధానంలో భూమి పూజ చేయనున్నారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వీటిని నిర్వహిస్తాయి. ఒక్కో టమాట ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.5.50 కోట్లు చొప్పున రెండింటికి రూ.11 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం, కేంద్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తున్నాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు.యూనిట్లు అందుబాటులోకి వస్తే టమాట రైతులకు ఎంతో జరుగుతుంది. ప్రధానంగా టమాటతో పాటు ఇతర కూరగాయలు గ్రేడింగ్, ధరలు పతనమైనప్పుడు కోల్డ్‌స్టోరేజీలో నిల్వ, గిట్టుబాటు ధర ఉన్నప్పుడు క్రయవిక్రయాలు చేసుకోవచ్చు. నేడు ఈ రెండు ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లతో పాటు కూడేరు మండలంలో పూర్తయిన ఒక కలెక్షన్ సెంటర్, తాడిపత్రి మండలం చుక్కలూరులోని కలెక్షన్ సెంటర్ కోల్డ్ రూములను సీఎం వర్చువల్ విధానంలోనే ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్ హాజరు కానున్నారు.

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించను

- ప్రతి అర్జీకి చక్కటి పరిష్కారం చూపాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం
- 'స్పందన'లో వివిధ సమస్యలపై 544 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఇన్‌చార్జ్ జేసీ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా ప్రజలు వివిధ సమస్యలపై సమర్పించే అర్జీలకు చక్కటి పరిష్కారం చూపించాలని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కార క్రమంలో ఏ దశలోనూ నిర్లక్ష్యాన్ని సహించబోనని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య, డీఈఓ సాయిరాం ప్రజల నుంచి 544 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమస్య పరిష్కారంపై అర్జీదారులు సంతృప్తి చెందకపోతే వారి అర్జీలు రీ–ఓపెన్ అవుతాయన్నారు. కాబట్టి అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. సమస్య పరిష్కారం కానిదైతే అదే విషయాన్ని అర్జీదారుకు తెలియజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అంతే తప్ప పరిష్కరించినట్లుగా నమోదు చేయకూడదన్నారు. అర్జీలు పరిష్కరించే క్రమంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని చెప్పారు. ప్రతి అర్జీ గడువుకు ముందే పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు.

అర్జీల్లో కొన్ని..

అనేక ఏళ్లుగా తాము సర్వే నంబరు 84లో సాగు చేసుకుంటున్న భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాసుపుస్తకం ఇచ్చారని కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన గుజ్జల నారాయణమ్మ ఫిర్యాదు చేశారు. తమకు ఈ భూమి తప్ప ఇతరత్ర జీవనాధారం లేదని, సాగు చేసుకుంటున్న భూమికి హక్కు కల్పించి ఆదుకోవాలని కోరారు.

- తమకు చెందిన స్థలంలో నగర పాలక సంస్థ అధికారుల డ్రెయినేజీ నిర్మించారని మారుతీనగర్‌కు చెందిన సి.శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.
- తన రేషన్ కార్డులో సంబంధం లేని జయప్రకాష్ అనే వ్యక్తిని చేర్చడం ద్వారా పింఛను కోల్పోవాల్సి వచ్చిందని తాడిపత్రి మండలం గన్నెవారిపల్లికి చెందిన నాగభూషణం ఫిర్యాదు చేశారు. ఆయన పేరిట నాలుగు చక్రాల వాహనం ఉందంటూ తనకు వస్తున్న పింఛను తొలగించారని చెప్పారు. జయప్రకాష్‌ను కార్డు నుంచి తొలగించి తనకు కొత్త రేషన్ కార్డు మంజూరు చేయించాలని కోరుకున్నారు.

ఖాతాల్లో 'పరిహారం'.. రైతుల్లో ఆనందం

- బీటీపీ కాలువకు భూములిచ్చిన రైతులకు పరిహారం జమ
- రూ.135 కోట్ల విడుదలతో పనులు ముందుకు..



ఇతని పేరు పాతిరెడ్డి. బ్రహ్మసముద్రం మండలం కుపటలింగనపల్లి. మూడెకరాల పొలం ఉంది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు 1.28 ఎకరాలిచ్చాడు. టీడీపీ హయాంలో రూపాయి కూడా పరిహారం రాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల కళ్యాణదుర్గానికి వచ్చినప్పుడు కాలువ డబ్బులు వెంటనే వేస్తామనడంతో పాతిరెడ్డి సంబరపడ్డారు. పది రోజుల్లోపే యూనియన్ బ్యాంకులోని తన అకౌంట్‌కు రూ.11.57 లక్షలు జమ అయ్యింది. ఇతనికే కాదు..చాలామంది రైతులకు ప్రస్తుతం పరిహారం జమ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బీటీపీ కాలువ (ఫైల్)

కళ్యాణదుర్గం: భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు ఆయువుపట్టు. ఈ ప్రాజెక్టు పెండింగ్ పనులను గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ ఇటీవల కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటనే నిధులు విడుదల చేసి..బీటీపీ పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం తొలివిడతలో రూ.135 కోట్లు విడుదల చేస్తూ జీఓ 2683 జారీ చేశారు. ఇందులో ప్రాజెక్టుకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం కింద రూ.80 కోట్లు, సివిల్ వర్కులకు రూ.55 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు కోసం కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 1,406 ఎకరాలను సుమారు 600 మంది రైతుల నుంచి సేకరించారు. ప్రస్తుతం వీరి ఖాతాల్లో పరిహారం జమ అవుతుండటంతో ఆనందం వెల్లివిరుస్తోంది.

రైతులను మోసగించిన టీడీపీ

2019 ఎన్నికల ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పలువురు రైతుల నుంచి డీకేటీ భూములను బీటీపీ కాలువ కోసం బలవంతంగా తీసుకుంది. ఒక్క రూపాయి కూడా పరిహారం చెల్లించలేదు. పైగా కళ్యాణదుర్గం మండలం గరుడాపురానికి చంద్రబాబును రప్పించి ఆర్భాటంగా శంకుస్థాపనలు చేశారు. ప్రాజెక్టుకు రూ.350 కోట్లు విడుదల చేశామంటూ రైతులను మోసం చేశారు. అనంతరం పెరిగిన ధరలతో రూ.950 కోట్లు కేటాయించినట్లు ఉత్తుత్తి జీఓలు ఇచ్చి రైతులను మరోసారి మభ్యపెట్టారు.

ఇక పనుల పరుగు

జగన్ ప్రభుత్వం తొలివిడతగా రూ.135 కోట్లు విడుదల చేయడంతో బీటీపీ పనులు ఊపందుకోనున్నాయి. రెండు టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్న బీటీపీకి ప్రత్యేక కాలువ ద్వారా కృష్ణా జలాలు తీసుకురానున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులు నింపడంతో పాటు రాయదుర్గం నియోజకవర్గంలో 8,400 ఎకరాలు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 4,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు.

రూ.25 లక్షలు వచ్చింది



నాకున్న 3.13 ఎకరాల భూమిని బీటీపీ కాలువ కోసం టీడీపీ గవర్నమెంట్లో తీసుకున్నారు. అప్పట్లో పైసా ఇవ్వలేదు. డబ్బు చూస్తానో, లేదో అనుకున్నా. కానీ ఇప్పుడు సీఎం జగన్ కాలువ డబ్బులు వేశాడు. నా బ్యాంకు అకౌంట్‌లో రూ.25 లక్షల 33 వేలు పడింది.

– కాపు శాంతమ్మ, కుపటలింగనపల్లి

రైతులకు మంచి రోజులు



బీటీపీ పూర్తి చేయడమే నా కల. ఈ క్రమంలోనే సీఎం జగనన్నకు ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించి నిధులు విడుదల చేయించాను. ఇక కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల రైతులకు మంచి రోజులు రానున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం డీకేటీ రైతుల నుంచి మాత్రమే బలవంతంగా భూములు సేకరించింది. పట్టా భూముల్లో ఎకరం కూడా సేకరించలేదు. మేం ఊరూరా తిరిగి పట్టా భూములున్న రైతులను ఒప్పించాం. వారికి అనువైన మేరకే ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా కృషి చేశాం. రూ.135 కోట్ల విడుదలతో ప్రాజెక్టు పనులకు ముందడుగు పడింది. త్వరలోనే సివిల్ వర్కులు ప్రారంభిస్తాం.

– ఉషశ్రీ చరణ్, మంత్రి

మిల్లెట్స్ మిషన్ అమలు దిశగా..

- 30 వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగు లక్ష్యం
- ప్రత్యామ్నాయం కింద పప్పుధాన్యాలు
- ప్రస్తుతానికి 1.10 లక్షల హెక్టార్లలో 'ఖరీఫ్'



జొన్న



కొర్ర

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగుకు సమయం ఆసన్నమైనా సరైన వర్షాలు రాలేదు. నెలాఖరు వరకు విత్తుకునేందుకు అవకాశం ఉంది. ఆగస్టు 5 తర్వాత సంప్రదాయ పంట వేరుశనగ వేయకపోవడం మంచిదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయశాఖ తాజా నివేదిక ప్రకారం 3.70 లక్షల హెక్టార్ల సాధారణ సాగుకు గాను ప్రస్తుతానికి 1.10 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. వేరుశనగ, కంది విస్తీర్ణం తగ్గిపోగా... పత్తి, మొక్కజొన్న, ఆముదం పంటలు సాధారణ సాగులో సగానికి పైగా వేశారు. సాగుకు ఇంకా సమయం ఉండటం, ఇటీవల తేలికపాటి వర్షాలు కొనసాగుతుండటంతో నెలాఖరు లేదా ఆగస్టు 5 నాటికి ఇంకా 60 వేల నుంచి 70 వేల హెక్టార్లలో పంటలు సాగులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు. అయినా ఇంకా లక్ష హెక్టార్ల వరకు మిగిలే అవకాశం ఉందంటున్నారు. దీంతో వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని చిరుధాన్యాల సాగును రెట్టింపు చేయడమే లక్ష్యంగా 'మిల్లెట్స్ మిషన్'ను పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరానికి సార్థకత చేకూరేలా రాగి, జొన్న, సజ్జ, కొర్ర తదితర పంటలు ఎంతలేదన్నా 25 వేల నుంచి 30 వేల ఎకరాల్లో సాగులోకి తెచ్చేలా ప్రణాళిక తయారు చేసింది. ఆగస్టు 15 తర్వాత ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు ప్లాన్ చేశారు. వాటి కింద పెసర, ఉలవ, అలసంద, ఆముదం, జొన్న పంటలను 50 వేల ఎకరాలకు పైబడి సాగులోకి వచ్చేలా ప్రోత్సహించాలని నిర్ణయించింది. అందుకోసం రాయితీతో 34 వేల క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాలు, మినీ కిట్ల రూపంలో 300 కిట్ల రాగులు, 2,545 కిట్ల కొర్రలు ఇవ్వనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. పండిన పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో కొనుగోలు చేస్తామని పేర్కొన్నాయి. సాగు విస్తీర్ణం గణాంకాలు పక్కాగా రాగానే.. మిషన్ మిల్లెట్, ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికలు అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

ప్రభావం చూపని 'నైరుతి'

నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్త ఆలస్యంగా ప్రవేశించినా పెద్దగా ప్రభావం చూపకపోవడంతో జూన్, జూలైలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జూన్‌లో 61 మి.మీకు గాను 45.8 మి.మీ, జూలైలో 63.9 మి.మీకు గాను 32 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో 9 మండలాలు మినహా మిగతా 22 మండలాల్లో సాధారణం కన్నా తక్కువగా వర్షాలు కురిశాయి.

ప్రస్తుతానికి ఖరీఫ్ సాగు..		
పంట	సాధారణ సాగు (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
వేరుశనగ	2,31,151	55,000
కంది	30,225	11,200
పత్తి	51,612	27,100
ఆముదం	12,463	7,150
మొక్కజొన్న	8,431	7,100

చిరుధాన్యాలకు కనీస మద్దతు ధర ఇలా..	
పంట	ధర క్వింటాలుకు
జొన్న (మాల్దండి)	రూ.3,225
జొన్న (హైబ్రీడ్)	రూ.3,180
సజ్జలు	రూ.2,500
రాగులు	రూ.3,846
మొక్కజొన్న	రూ.2,090

క్లుప్తంగా

గోడను ఢీకొని యువకుడి మృతి


మృతుడు నరేష్

అమడగూరు: మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడిని పక్కకు తోసేయడంతో అదుపు తప్పి గోడను ఢీకొని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం గౌరాపురానికి చెందిన నరసింహులు కుమారుడు నరేష్ (26) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న నరేష్ తన భార్య నాగమణితో గొడవపడుతుండగా తండ్రి నరసింహులు జోక్యం చేసుకుని సర్దిచెప్పే ప్రయత్నంలో కుమారుడిని పక్కకు తోశాడు. అప్పటికే మద్యం మత్తులో స్వీయ నియంత్రణ కోల్పోయిన నరేష్ అదుపు తప్పి గోడను ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తండ్రి నరసింహులు తీసుకెళ్లాడు. చికిత్సకు స్పందించక నరేష్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

అమరాపురం: మండలంలోని బసవనపల్లి పంచాయతీ కడతదహళ్లికి చెందిన దేవరాజు (53) తన పొలంలో చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... వ్యవసాయ పనులతో జీవనం సాగించే దేవరాజు గత పదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎంతగా ప్రాధేయపడినా మద్యం మానేయలేదు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యాయి. మద్యం మానేయాలని వైద్యులు చెప్పినా వినేవాడు కాదు. గత రెండు రోజులుగా అతిగా మద్యం సేవిస్తూ వచ్చిన దేవరాజ్.. సోమవారం ఉదయం తన పొలంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటి తర్వాత వేరుశనగ పంటలో కలుపు మొక్కలు తొలగించేందుకు కూలీలతో పాటు వెళ్లిన భార్య ముత్తక్క.. అక్కడ చెట్టుకు విగతజీవిగా వేలాడుతున్న భర్తను చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కలిసొచ్చిన టమాట

ప్రతి రైతుకూ ఓ రోజు వస్తుంది. ఆ రోజు వచ్చినప్పుడు ఆ రైతు 'పంట' పండుతుంది. అలాంటి రోజున అప్పటి వరకూ తాను పడిన కష్టం ఒక్కసారిగా తీరిపోతుంది. ప్రస్తుతం అలాంటి రోజు రానే వచ్చింది. జిల్లాలో టమాట సాగు చేసిన రైతులు కేవలం రోజుల వ్యవధిలోనే మంచి ఆదాయాన్ని గడిస్తున్నారు.

- అన్నదాతలకు సిరుల పంట
- గిట్టుబాటు ధరతో రైతుల హర్షం


కొత్తచామలపల్లి వద్ద సాగు చేసిన టమాట పంట


టమాటాలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

చిలమత్తూరు: మార్కెట్‌లో టమాట ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు టమాటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మనస్తాపం చెందిన రైతులు రోడ్డు పక్కన రాసులుగా పడేసి తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. గత కొన్నేళ్లుగా టమాట సాగు చేసి గిట్టుబాటు ధర లేక నష్టపోయిన రైతులందరూ కోలుకునేలా ఈ ఏడాది కాసుల వర్షం కురిపిస్తోంది. రోజుల వ్యవధిలోనే రైతులను లక్షాధికారులను చేసేస్తోంది.

రూ.1.20 కోట్ల ఆదాయం

కర్ణాటక ప్రాంతానికి చెందిన రైతు చౌడిరెడ్డి.. వ్యవసాయంపై ఆసక్తితో చిలమత్తూరు మండలం కొత్త చామలపల్లిలో కొన్నేళ్ల క్రితం పొలం కొనుగోలు చేశాడు. ఇందులో ప్రధాన పంటగా టమాటనే సాగు చేసేవాడు. గతంలో పలుమార్లు మంచి లాభాలే గడించినా... అదే స్థాయిలో నష్టాలు కూడా చవిచూశాడు. ఈ సారి ఏకంగా 13 ఎకరాల్లో టమాట సాగు చేశాడు. ధరలు అమాంతం పెరగడంతో ఆయన పడ్డ కష్టానికి ప్రతి ఫలం దక్కింది. ప్రస్తుతం ఎనిమిది ఎకరాల్లో పంట మార్కెట్‌కు తరలిస్తుండగా ఇప్పటి వరకూ 120 టన్నుల దిగుబడి వచ్చింది. కేవలం 30 రోజుల వ్యవధిలోనే రూ.1.20 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఎనిమిది ఎకరాల్లోనే మరో 100 టన్నుల దిగుబడి చేతికి అందే అవకాశముండడంతో మరో రూ.కోటి వరకు ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. అలాగే మరో 6 ఎకరాల్లోని పంట 10 రోజుల్లో కోతకు రానుంది.

30 సెంట్లలో రూ.2.5 లక్షలు..

చిలమత్తూరు మండలం ఎస్.ముద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి తనకున్న పొలంలోని 30 సెంట్ల విస్తీర్ణంలో రూ.10వేలు పెట్టుబడితో టమాట సాగు చేశాడు. చిన్న కమతం కావడంతో కూలీల అవసరం లేకుండా పోయింది. తన తల్లితో కలసి టమాట తోటలో సొంతంగా పనులు చేసుకుంటూ పోయాడు. పంట చేతికి అందే సమయానికి మార్కెట్‌లో ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో ఇప్పటి వరకు ఆయన రూ.2.5 లక్షల ఆదాయాన్ని గడించాడు.

ఈ ధర ఊహించలేదు



టమాటకు ఇంత ధర వస్తుందని ఊహించలేదు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి ధరలు ఉంటాయో లేదోననే ఆందోళనలో కొట్టుమిట్టాడేవాళ్లం. గతంలో 12 ఎకరాల్లో టమాట సాగు చేసి రూ.50 లక్షలు నష్టపోయా. ఈ సారి 13 ఎకరాల్లో సాగు చేశాను. ప్రభుత్వం జొన్న, రాగి, వేరుశనగకు మద్దతు ధర ఇచ్చినట్లే టమాటాకు ఇస్తే ఇంతగా ధరలు పెరగవని నా ఆలోచన.

– చౌడిరెడ్డి, రైతు

బంగ్లాదేశ్‌కు రవాణా



టమాటకు భారీగా డిమాండ్ నెలకొంది. ఇక్కడి నుంచి టమాటను దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్‌కూ ఎగుమతి చేస్తున్నాం. మరికొన్ని రోజులు ధరల పరిస్థితి ఇలాగే ఉంటుంది.

– సత్తిబాబు, టమోట వ్యాపారి

తుంగభద్ర వరద నీరు నిల్వ చేయాలి

అనంతపురం అర్బన్: కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్రకు నీటి ప్రవాహం పెరిగి దిగువకు వదిలే అవకాశం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో వరద నీటిని జిల్లాలో నిల్వ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాగాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందుకు అవసరమైన నిధులు, సిబ్బందిని కేటాయించేలా జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు.

అనంతపురం, నెల్లూరు జట్ల గెలుపు


79 పరుగులు చేసిన యోగానంద

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సీనియర్ అంతరజిల్లాల క్రికెట్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన రెండో రౌండ్ వన్డే మ్యాచ్‌ల్లో అనంతపురం, నెల్లూరు జట్లు గెలుపొందాయి. తొలి మ్యాచ్‌లో వైఎస్సార్, నెల్లూరు జట్లు తలపడగా... టాస్ గెలిచి నెల్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. 35.4 ఓవర్ల వద్ద 119 పరుగులకు కడప జట్టు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లకే ఒక వికెట్ నష్టానికి 120 పరుగులు చేసి, విజయాన్ని సొంతం చేసుకుంది.

- రెండో మ్యాచ్‌లో అనంతపురం జట్టుతో తలపడిన చిత్తూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 49.1 ఓవర్ల వద్ద 200 పరుగులకు ఆలౌట్ అయింది.అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 37.1 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. వర్షం కారణంగా వీజేడీ పద్ధతిలో అనంతపురం జట్టు గెలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. జట్టులో ఎంకే దత్తారెడ్డి 29, యోగానంద 79, రాజకుళ్లాయప్ప 52 పరుగులు సాధించారు.

అగళి 'మోడల్' ప్రిన్సిపాల్ చక్రధారి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి


సస్పెన్షన్‌కు గురైన ప్రిన్సిపాల్ చక్రధారి(ఫైల్)

మడకశిర: మహిళా టీచర్‌ను ఇబ్బందులకు గురిచేసిన అగళి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చక్రధారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు పాఠశాల విద్య ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు అగళి మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీనివాస భాస్కర్ తెలిపారు.

టీచర్ ఫిర్యాదులో ఆగడాలు వెలుగులోకి

అగళి మోడల్ స్కూల్‌లో చక్రధారి ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా పని చేస్తున్నారు. ఇదే స్కూల్‌లో పని చేస్తున్న ఓ మహిళా టీచర్‌పై అతను ఇబ్బందికరంగా వ్యవహరించాడు. తన నడక, కూర్చొనే విధానంపై విద్యార్థుల ఎదుట యాక్టింగ్ చేసి చూపిస్తూ అవహేళన చేశాడని, ముఖానికి ఏమైనా క్రీమ్‌లు వాడుతున్నారా? అని తోటి టీచర్ల ఎదుటే తనను అవమానించినట్లు ఆమె అగళి ఎంఈఓ-2కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు స్థానిక ఎంపీపీ వచ్చి విచారించగా, అతను వెళ్లిపోయాక మళ్లీ తనపై వివిధ రకాల కామెంట్లు చేస్తూ వేదనకు గురిచేసినట్లు మహిళా టీచర్ ఈనెల 15న ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. అంతేకాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కూడా బెదిరించినట్లు ఫిర్యాదులో వెల్లడించారు.

విచారణ నివేదిక మేరకు సస్పెన్షన్ వేటు

మహిళా టీచర్ ఫిర్యాదుతో స్పందించిన ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి... పెనుకొండ డిప్యూటీ డీఈఓ రంగస్వామిని విచారణ అధికారిగా నియమించారు. దీంతో రంగస్వామి అగళి మోడల్ స్కూల్‌కు వెళ్లి టీచర్లు, విద్యార్థులను కలిసి విచారణ చేశారు. టీచర్లపై కామెంట్లు చేయడం, తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను దుర్భాషలాడటం, విద్యార్థుల డ్రెస్‌ల గురించి మాట్లాడడం, విద్యార్థులతో సంబంధంలేని విషయాలు మాట్లాడటం, ఎంపీపీ తనిఖీకి వచ్చినప్పుడు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఇంకా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఆ విషయాలన్నీ పేర్కొంటూ డిప్యూటీ డీఈఓ రంగస్వామి నివేదికను ఆర్జేడీకి పంపారు. వెంటనే స్పందించిన ఆర్జేడీ కృష్ణారెడ్డి ప్రిన్సిపాల్ చక్రధారిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు ఉత్తర్వులను సదరు ప్రిన్సిపాల్‌కు అందించినట్లు అగళి ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ తెలిపారు.

యువకుడి దుర్మరణం


మృతుడు యల్లప్ప

కణేకల్లు: వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారికి చెందిన యల్లప్ప(34) ఏడాది క్రితం ఆలూరు గ్రామానికి వచ్చి పల్లెల్లో సంచరిస్తూ చిన్నచిన్న సామాన్లు విక్రయించడం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం రాయదుర్గంలో పని ముగించుకుని తన బంధువు నాగరాజుతో కలసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో బసయ్య తోట వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న నేమ్‌బోర్డును ఢీకొన్నాడు. ఘటనలో బలమైన గాయాలు కావడంతో యల్లప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. కాలు విరిగి బాధపడుతున్న నాగరాజును స్థానికులు వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సునీతమ్మ, ఇద్దరు కుమారులున్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

రైలు బోగి తగిలి మహిళ మృతి


సావిత్రమ్మ మృతదేహం

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు రైలు బోగి తగిలి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక కేతిరెడ్డికాలనీకి చెందిన సావిత్రమ్మ(54) సోమవారం ఉదయం పట్టణంలోని మార్కెట్‌కు వచ్చి కూరగాయలు తీసుకుని ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యంలో పట్టాలు దాటుకునేందుకు నిలబడి ఉండగా వేగంగా రైలు దూసుకెళ్లడంతో గాలికి సావిత్రమ్మ అదుపు తప్పి బోగికి తగిలింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్: స్థానిక గాంధీనగర్ సర్కిల్‌లోని ఐసీఐసీఐ బ్యాంక్ వెనుక ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. నిందితుల నుంచి రూ.20,350 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

గార్లదిన్నె: బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయమైనట్లు పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. వివరాలు.. గార్లదిన్నెకు చెందిన కేశవరెడ్డికి స్థానిక కెనరాబ్యాంక్‌లో ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి రూ.10 వేలు డ్రా చేసినట్లు అతని సెల్‌ఫోన్‌కు సోమవారం మెసేజ్ అందింది. దీంతో అనుమానం వచ్చిన కేశవరెడ్డి నేరుగా బ్యాంక్‌కెళ్లి ఆరా తీశాడు. ఖాతా నుంచి రూ.10 వేలు డ్రా చేసింది వాస్తవమేనని అధికారులు ధ్రువీకరించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురానికి చెందిన సూర్యచంద్రారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. భూ వివాదంలో అదే గ్రామానికి చెందిన నాగలక్ష్మిని సూర్యచంద్రారెడ్డి కులం పేరుతో దూషించి, నానా దుర్భాషలాడడంతో బాధితురాలు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో విచారణ అనంతరం సూర్యచంద్రారెడ్డిపై సోమవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

- జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సమన్వయంతో పనిచేసినప్పుడే నేరాలకు అడ్డుకట్ట పడుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశించారు. రైల్వే పరిధిలో నేరాల నియంత్రణపై సోమవారం స్థానిక తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో గుంతకల్లు రైల్వే జోన్ పరిధిలోని జీఆర్‌పీ డీఎస్పీ, సీఐలతో ఆమె సమీక్షించారు. జీఆర్‌పీ డీఎస్పీలు అబ్దుల్‌అజీజ్ (గుంతకల్లు), షేక్ షాను (తిరుపతి) మల్లికార్జునరావు (నెల్లూరు) తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ... గంజాయి అక్రమ రవాణా చేసే వారిపై నిఘా పెంచాలన్నారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాల్లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, పరిసరాల్లో సంచరిస్తున్న అనుమానితుల వేలిముద్రలు సేకరించాలన్నారు. టెక్నాలజీను ఉపయోగించుకుంటూ నేరాలను అదుపు చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఈ ఆరునెలల్లో జరిగిన నేరాల దర్యాప్తులో పురోగతిపై ఆరా తీశారు.

బీసీల గురించి మాట్లాడే అర్హత నీకెక్కడిది?

- రామచంద్రయాదవ్‌ను ప్రశ్నించిన బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల


మాట్లాడుతున్న డేరంగుల ఉదయ్‌కిరణ్

గుంతకల్లు: బీసీ సమస్యలపై ఏనాడూ చిన్నపాటి పోరాటం కూడా చేయని పుంగనూరు రామచంద్రయాదవ్ ఈ రోజు పార్టీ ఏర్పాటు చేసుకుని బీసీలకు న్యాయం చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం విజయవాడలో సభ నిర్వహించి భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన రామచంద్రయాదవ్‌కు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బీసీలకు మేలు చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది వైఎస్సార్‌సీపీ నేనని స్పష్టం చేశారు. మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తే తన ఇమేజ్ పెరిగిపోతుందనుకోవడం రామచంద్రయాదవ్ అవివేకానికి నిదర్శనమన్నారు. కేవలం సెక్యూరిటీ పెంచుకునేందుకే తన ఇంటిపై మంత్రి పెద్దిరెడ్డి దాడులు చేయించారంటూ కల్పిత కథనాలు అల్లారని మండిపడ్డారు. పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సరితూగే స్థాయి రామచంద్రయాదవ్‌కు లేదన్నారు. కేవలం బీసీ ఓట్లను చీల్చేందుకే పార్టీ ఏర్పాటు చేశారని, అయితే సీఎం వైఎస్ జగన్ చరిష్మా ఎదుట ఏ రాజకీయ పార్టీ నిలువజాలవని అన్నారు.

బైక్‌ను ఢీ కొన్న కారు

గుత్తి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం వైటీ చెరువుకు చెందిన ఆంజనేయులు, బందెన్న, గుత్తి మండలం అనగానదొడ్డి నివాసి తిమ్మప్ప సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గుత్తి నుంచి జొన్నగిరికి బయలు దేరారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి–ఎర్రగుడి గ్రామాల మధ్య ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. దీంతో అదుపు తప్పి రోడ్డుపై పడిన తిమ్మప్ప, ఆంజనేయులు, బందెన్న తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురినీ గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిమ్మప్ప, బందెన్నను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రెండిళ్లలో చోరీ

అమరాపురం: మండలంలోని బసవనపల్లిలో ఆదివారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బసవనపల్లికి చెందిన రాజప్ప కుటుంబంతో సహా కర్ణాటకలోని శిర తాలూకా బరగూరుకు వెళ్లారు. విషయాన్ని పసిగట్టిన దుండగులు ఆదివారం రాత్రి రాజప్ప ఇంట్లోకి చొరబడి బీరువాలోని 3 జతల కమ్మలు, ఒక జత జుంకీలు, రూ.1.01 లక్ష అపహరించుకెళ్లారు. అలాగే మరో ఇంట్లో ఒంటరిగా ఉన్న సిద్ధగంగమ్మను గమనించి లోపలకు చొరబడి ఒక జత బంగారు కమ్మలు, రూ.30 వేలు అపహరించుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేశంలో గుర్తింపు వచ్చేలా గ్రామాలను తీర్చిదిద్దాలి

- కలెక్టర్ గౌతమి


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి,అధికారులు

అనంతపురం అర్బన్: దేశ స్థాయిలో గుర్తింపు, అవార్డులు అందుకునేలా గ్రామాలను సంపూర్ణ స్వచ్ఛతగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 పోస్టర్లను ఆమె విడుదల చేసి, మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాలను ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఘన వ్యర్థ పదార్థాలు, మురుగునీరు, మలిన వ్యర్థాలు తదితర వాటి నిర్వహణపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి వారి భాగస్వామ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'మిషన్ ఇంద్రధనస్సు'ను విజయవంతం చేయండి

అనంతపురం అర్బన్: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం విధివిధానాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ వివరించారు. కార్యక్రమం ద్వారా ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి టీకాలు వేసుకోని చిన్నారులను గుర్తించి, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఐదు రోజుల పాటు విడతల వారీగా వ్యాక్సిన్ వేయాలన్నారు. మిజెల్స్, రూబెల్లా మహమ్మారిని 2023 ఏడాదికి నిర్మూలించాలనేది లక్ష్యంగా నిర్దేశించుకుని ఇంటింటి సర్వే పూర్తి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, జెడ్పీ సీ ఈఓ భాస్కర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'జగనన్న సురక్ష'

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ సోమవారం తెలిపారు.

కనులవిందుగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అధిక శ్రావణమాస షష్టి సందర్భంగా కనులవిందుగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర , శ్రీవల్లి , దేవసేన ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రాల నడుమ మంగళవాయిద్యాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

అనంతపురం కల్చరల్: నిరుద్యోగ యువతీ యువకుల కోసం బ్యూటీషియన్, మగ్గం నేయడంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సాయి లిఖిత ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళల కోసం బ్యూటీషియన్ కోర్సు గుంతకల్లులో, చేనేత మగ్గం శిక్షణ ధర్మవరంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్: 9440984298, 98669 20893లో సంప్రదించాలని కోరారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి



ప్రజలకు సూచనలు ఇస్తున్న పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జమేదార్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

నేలవాలిన బీర పంట



నేలకొరిగిన బీర పంటను చూపుతున్న రైతు గంగాధర్ రెడ్డి

రాప్తాడు: గాండ్లపర్తికి చెందిన తాడిమర్రి గంగాధర్ రెడ్డి సాగు చేసిన బీర పంట సోమవారం గాలీవాన బీభత్సానికి నేలవాలింది. నాలుగెకరాల్లో కట్టెలతో తీగలు ఏర్పాటు చేసి, బీర పంట సాగు చేశాడు. బీర పంట కోతకు వచ్చింది. మంగళవారం ఉదయం పంట కోతకు సిద్ధమయ్యాడు. అంతలోనే గాలీవాన బీభత్సానికి పంట నేలవాలింది. దీంతో రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

త్వరలో ప్రైవేట్ టీచర్లకు శిక్షణ



ఆర్జేడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

రాప్తాడురూరల్: త్వరలోనే ప్రైవేట్ మేనేజ్‌మెంట్ స్కూల్ టీచర్లకు సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, అలాగే హెచ్‌ఎంలు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు కూడా శిక్షణ ఇస్తామని ప్రాథమిక విద్యాశాఖ ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా నాయకులు ఆర్జేడీని కలిశారు. ఈ సందర్భంగా వివిధ విషయాలు చర్చించారు. పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల చైల్డ్ ఇన్ఫర్మేషన్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆర్జేడీని కలిసిన వారిలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, సెక్రటరీ గాజుల చంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, నగర అధ్యక్షుడు శ్రీనాథ్, ట్రెజరర్ అన్వర్‌బాషా, నార్పల సంజీవరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, అంజన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ట్యాంకులకు అంతర్గత కనెక్షన్లు ఇవ్వనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ ఎస్‌ఈ సతీష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధికి కృషి

● రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఇంటిపట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధికి పాటుపడుతున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎంత మందికి సంక్షేమ పథకాలు అందాయి..ప్రస్తుతం తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇళ్లపట్టాలు ఎన్ని వచ్చాయి.. ఎంత మందికి ఇళ్లు మంజూరయ్యాయో గమనించాలని అన్నారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీలోని సుందరయ్యకాలనీ, జాకీర్‌కొట్టాలు, బీఎస్‌ఆర్ కాలనీ, దండోరాకాలనీ, ఆదర్శకాలనీ, జీఎం కాలనీ వాసులకు మంజూరైన 540 పట్టాలను జాకీర్‌కొట్టాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ప్రత్యేక తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటుకు కృషి..

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ కాలనీలు దాదాపు 25 ఏళ్ల కిందట ఏర్పడ్డాయన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇళ్ల పట్టాలు మంజూరు కాలేదన్నారు. జనాభా ఎక్కువగా ఉన్న మండలం కావడంతో రెవెన్యూ సిబ్బందిపై పనిఒత్తిడి ఉందని, దీంతో ప్రత్యేక మండలం ఏర్పాటు విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి జీఓ ఇచ్చారన్నారు. గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల అయ్యిందన్నారు. ఉద్యోగుల కేటాయింపు ఉత్తర్వులు వచ్చిన వెంటనే అనంతపురం రూరల్ మండలంలోని గ్రామాలకు కక్కలపల్లి కాలనీ పంచాయతీలోనే ప్రత్యేక తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు చరలు తీసుకుంటామన్నారు. ఈ కాలనీల వాసులకు 1,050 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉన్నా, వంక పోరంబోకు స్థలం అని డైక్లాయిడ్‌లో ఉండడంతో ఆలస్యమవుతోందన్నారు. వాటికి కూడా త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం 95 మందికి ఓటీఎస్ పత్రాలు అందించారు. కార్యక్రమంలోఎంపీపీ జి.వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ కొండయ్య, నాయకులు ధనుంజయయాదవ్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ తేజశ్విని, ఎంపీటీసీ సభ్యులు గాయత్రీదేవి, వడ్డే శ్రీనివాసులు, మండల కన్వీనర్ పవన్, యూత్ కన్వీనర్ కె.శ్రీనివాసులు, జేసీఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన అమానవీయం

● మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



శాంతిర్యాలీలో నినాదాలు చేస్తున్న జిల్లా పాస్టర్లు



మౌన ప్రదర్శన చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, తదితరులు

అనంతపురం అర్బన్: మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న ఘటనలు అమానవీయమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మణిపూర్ ఘటనలను నిరసిస్తూ అనంత పౌర స్పందన ఆధ్వర్యంలో కవులు, రచయితలు, డాక్టర్లు, న్యాయవాదులు, మేధావులు, విద్యార్థులు టవర్ క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ మణిపూర్ సంఘటన మానవ సమాజాన్ని కలచివేస్తోందన్నారు. రెండునెలలకు పైగా అక్కడ హింసాకాండ, ఘర్షణలు, అత్యాచారాలు జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు.మారణకాండను నియంత్రించడంలో అక్కడి ప్రభుత్వాలు, పోలీసు యంత్రాగం ఘోరంగా విఫలమైనట్లు తెలిపారు. అమానవీయమైన సంఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జయరామప్ప, మానవహక్కుల వేదిక బాషా, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దుర్ఘటనపై పాస్టర్ల శాంతిర్యాలీ

అనంతపురం కల్చరల్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న హింసాత్మక దాడులు దేశభద్రతకు ముప్పువాటిల్లేలా చేస్తున్నాయని జిల్లా పాస్టర్లు అన్నారు. సోమవారం జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ నెహమ్యా నాగరాజు నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో పాస్టర్లు మణిపూర్ ఘటనలను నిరసిస్తూ నగర వీధుల్లో శాంతిర్యాలీ చేశారు. తొలుత రెవరెండ్ నవీన్‌కుమార్ వాక్యపరిచర్య చేశారు. రెవరెండ్ బందెల రాజు సామూహిక ప్రార్థనలు చేయించారు. నెహమ్యానాగరాజు, పాస్టర్ మనుష్యే, రెవరెండ్ మార్క్, జీఆర్ ఆనంద్ తదితరులు ర్యాలీలో మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్ శాంతివర్ధన్, రూసఫ్, జీవన్‌బాబు, బిషప్ వాసు, అనిల్‌కాంత్, వైపీ బాబు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు క్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ల సమావేశం జరిగింది.

తెలుగు సాహిత్యంలో జాషువాది విశిష్ట స్థానం

● ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ తదితరులు



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్కేయూ ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం

అనంతపురం కల్చరల్: తెలుగు సాహిత్యంలో మహాకవి గుర్రం జాషువాది విశిష్ట స్థానమని, ఆయన కవిత్వం వినూత్న రీతిలో సాగి సామాన్యులను చైతన్యవంతం చేసిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గుర్రం జాషువా వర్ధంతి వేడుకలను జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య ఆధ్వర్యంలో కవులు, రచయితలు నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, జాషువా సాహిత్య పీఠం అధ్యక్షుడు ఆచార్య బాలసుబ్రమణ్యం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకరరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రంగస్వామి, సీనియర్ సాహితీవేత్తలు తరిమెల అరమనాథరెడ్డి తదితరులు మాట్లాడారు.జాషువా మరణంలేని కవి అని కొనియాడారు. శాంతి, ప్రేమ, కరుణ, అహింసల మార్గాన్ని ఎంచుకున్న గుర్రం జాషువా ప్రతి రచనా సమాజాన్ని చైతన్యవంతం చేసిందన్నారు. అంతకు ముందు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ వేత్తలు డాక్టర్ అంకే శ్రీనివాస్, పూజారి ఈరన్న, నబీరసూల్, నాగలింగయ్య, నాగేంద్ర, రియాజుద్దీన్, మిద్దె మురళీకృష్ణ, ఎస్కేయూ, ఆర్ట్స్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ రుగ్మతలు రూపుమాపేదే సాహిత్యం

అనంతపురం: సమాజ రుగ్మతలు రూపుమాపేది, సమాజంలో మార్పు తెచ్చేదే సాహిత్యం అని బలంగా నమ్మిన మహనీయుడు గుర్రం జాషువా అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగుభారతి విభాగాధిపతి ప్రొఫెసర్ జి. బాలసుబ్రమణ్యం అన్నారు. గుర్రం జాషువా 52వ వర్ధంతిని పురస్కరించుకొని తెలుగు భారతి విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుర్రం జాషువా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఖండ కావ్యాల రారాజు జాషువా మహా కవి , సమాజంలో గొప్ప మార్పును కోరుకున్న గొప్ప కవి అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు విభాగం ఆచార్యులు డాక్టర్ జి. నరసింహన్, డాక్టర్ ఎస్.ఆర్ .సదాశివా రెడ్డి , అకడమిక్ కన్సెల్టెంట్లు డాక్టర్ ఏపీ నాగేంద్ర, డాక్టర్ కే జగదీష్, డాక్టర్ తస్నీరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడి జయంతి



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమామోహన్ రెడ్డి, కార్యదర్శి పి.రమ నివాళులర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, అనంతపురంలో అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతిని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమామోహన్ రెడ్డి మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ ఉద్యమంలో విశేష కృషి చేసి గ్రంథాలయ పితామహుడిగా పేరొందారన్నారు. గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను 1916లో స్థాపించారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తుడు అయిన అయ్యంకి సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపగ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్, అహమ్మద్, బాషా, కావేరి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రైతు సంఘం నిరసన

అనంతపురం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ ప్రసాద్ మాట్లాడారు. తెలంగాణ తరహాలో ఇక్కడా ప్రతి రైతుకూ ఎకరాకు రూ.10 వేలు సాయం అందించాలన్నారు. రెండెకరాలు సాగు చేస్తున్న రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. కౌలు రైతులు తీసుకున్న అన్నిరకాల పంటల రుణాలను మాఫీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమికి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, రైతు సంఘం జిల్లా జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లికార్జున, అధ్యక్షుడు గోవిందు, ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పార్వతి ప్రసాద్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

అనంతపురం క్రైం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం నగరంలోని 61వ సచివాలయాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎన్ని సమస్యలు గుర్తించారు.. ప్రతి ఇంటికీ వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంపైనే ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇతర సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా తెలియజేయాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయ హుండీ కానుకలను సోమవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయంలో మొత్తం మూడు హుండీలుండగా, శనివారం రాత్రి ఇద్దరు దుండగులు ఒక హుండీని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అయితే రెండురోజుల క్రితం అమ్మవారికి వచ్చిన కానుకలను లెక్కించగా, అందులో చిల్లర (నాణేలు) మాత్రమే అందులో ఉండగా దుండగులు అలాగే వదలివెళ్లినట్లు ఆయన తెలిపారు. దీంతో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు హుండీలోని కానుకలు లెక్కించగా, రూ.2,04,230 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వి జనార్దన్ నాయుడు, ఆలయ కమిటీచైర్మన్ కురుబ ముత్యాలప్ప, గ్రామస్తులు తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం ఆరోరోడ్డులో భారీ ఎత్తున నిర్మాణమవుతున్న మణికర్ణిక ఘాట్ ప్రాంగణంలోని శ్మశాన వాటికను ఎమ్మెల్యే సందర్శించి, అక్కడి పనులను పరిశీలించారు. శివాలయ నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, నాయకులు నాగభూషణం, మురళీ, సూర్యప్రకాష్, క్రిష్ణం రఘు, జయం సురేష్ తదితరులు ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.2 కోట్లతో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. గ్యాస్ బర్నింగ్ పద్ధతిని త్వరలో అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. అంతకు ముందు శివాలయంలో ఎమ్మెల్యేను ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలాదేవి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక గుర్తింపు

అనంతపురం సిటీ: వైఎస్సార్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లింమైనార్టీలకు గుర్తింపు లభించిందని మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ అన్నారు. కక్కలపల్లిలోని టమాట మండీ వెనుకనున్న మసీద్-ఏ-ఫజులున్నీసా మసీద్‌లో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నమాజు అనంతరం మత పెద్దలు, ముస్లింలతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి, ముస్లింల ఉన్నతికి కృషి చేశారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ముస్లిం మైనార్టీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ నెలాఖరు వరకు అన్నీ మసీదులు తిరిగి, సమస్యలను తెలుసుకొని వాటిని నివేదిక రూపంలో తయారు చేసి, సీఎం జగన్‌కు అందజేస్తామన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ పని చేసే విధానాన్ని తెలుసుకుంటున్న మేయర్,డిప్యూటీ మేయర్

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశారని, ముఖ్యంగా నాడు-నేడు కార్యక్రమాల ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నారని మేయర్ వసీం తెలిపారు. సోమవారం నగరంలోని పాట్టి శ్రీరాములు స్కూల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ పరిశీలించారు. పాఠశాలల్లో ఇటీవల ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) పని చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఇలాంటి సౌలభ్యం కార్పొరేట్ పాఠశాలల్లో కూడా లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధన అందిస్తున్నారన్నారు. ఒక్క పాట్టి శ్రీరాములు స్కూల్‌లోనే రూ.1.40 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న విషయాన్ని మేయర్ గుర్తు చేశారు. నగరంలోని 29 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపుగా రూ.10 కోట్లతో సౌకర్యాలు పెంచేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ దాక్షాయని, ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్

రాప్తాడురూరల్: సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం విద్యాసంస్థల బంద్ ఉంటుందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం అనంతపురం నగరంలో ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్, ఏపీఎస్ఎఫ్, ఏఐఎస్‌బీ, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ క్యాంపస్‌లో...

అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ ఉంటుందని ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన తెలిపారు. సోమవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. నాలుగేళ్ల డిగ్రీని రద్దు చేసి పాత పద్ధతిలోనే మూడేళ్ల డిగ్రీ ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐసా యూనివర్సిటీ కార్యదర్శి రాజునాయక్, నాయకులు వంశీకృష్ణ, ఎన్ఎస్‌యూఐ నాయకులు శివ, విష్ణుసాయి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దస్తగిరి, కుల్లాయిస్వామి ఉత్సవాల్లో పీర్లస్వాములను చావిడిలో కొలువు దీర్చి పూజలు నిర్వహించారు.ఈ ఉత్సవాలకు కర్నూలు, గుంటూరు, కృష్ణ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



చావిడిలో కొలువుదీరిన పీర్లస్వాములు

జిల్లా స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థినుల ఎంపిక

కనగానపల్లి: కనగానపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినులు ఆరుగురు జిల్లా స్థాయిలో జరగనున్న అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు పీడీ మాధవరాజులు తెలిపారు. ఆర్టీటీ ఆధ్వర్యంలో రామగిరి మండలం నసనకోటలో క్లస్టర్ స్థాయిలో జరిగే అథెలిటిక్స్ మీట్‌లో పాఠశాల విద్యార్థినులు దీపిక, సరస్వతి, రిషిత, మున్ని (పరుగు పందెం), అనూష (షాట్‌పుట్) ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. వీరందరినీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. స్థానిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

రైతు బజారుకు ఆ'ధర'ణ



రైతుబజారులో కిలో టమాటాలు రూ.50కే ఇస్తుండడంతో బేరు కట్టిన జనం

ఇటీవల కాలంలో టమాటాలు, కందిబేడలు, బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. దీంతో పేద సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాటిని కొనుగోలు చేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరకు టమాటాలు, కందిబేడలు, బియ్యం విక్రయాలు చేపట్టింది. టమాటలు కిలో రూ.50, కందిబేడలు రూ.130కి విక్రయిస్తుండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు వరుస కట్టారు. దీంతో రైతు బజారుకు ఆ'ధర'ణ లభిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



కిలో రూ.130తో కందిబేడలు విక్రయిస్తున్న దృశ్యం



టమాటాలు తూకాలు వేస్తున్న దృశ్యం